7

సాక్షి నల్లగొండ

శనివారం ׀ 14 ׀ జూన్ ׀ 2025



సర్కిళ్లకు దేవుళ్ల పేరు
యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ కొండ కింద ఉన్న సర్కిల్స్‌కు అధికారులు దేవుళ్ల పేర్లను పెట్టారు. - 8లో



నిందితుల అరెస్ట్
దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురు నిందితుల్లో ఇద్దరు శుక్రవారం చౌటుప్పల్‌లో పోలీసులకు చిక్కారు. - 8లో



కబడ్డీ విజేత నల్లగొండ
ట్రాన్స్‌కో, డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ కబడ్డీ విజేతగా నల్లగొండ నిలిచింది. - 8లో

ఇక్కడే ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ

అనుముల మండలం యాచారంలో 30 ఎకరాల్లో నిర్మాణానికి అడుగులు

- ఇన్నాళ్లూ విజయవాడ అంభాపురం ఫ్యాక్టరీనే దిక్కు
- మంత్రి తుమ్మల చర్యలతో దిగొచ్చిన పతంజలి సంస్థ
- నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో 15 వేల ఎకరాల్లో పంటసాగు
- తీరనున్న ఆయిల్‌పామ్ రైతుల కష్టాలు



కనగల్ మండలంలో ఇటీవల తెంపిన ఆయిల్‌పామ్ గెలలు

నల్లగొండ అగ్రికల్చర్ : నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుచేస్తున్న రైతుల కష్టాలు ఎట్టకేలకు తీరనున్నాయి. అనుముల మండలంలోని యాచారం గ్రామంలో పంతంజలి సంస్థ ఫ్యాక్టరీ నిర్మాణానికి పూనుకుంది. ఇన్నాళ్లూ స్థానికంగా ఫ్యాక్టరీ లేక రెండు జిల్లాల్లో పంట సాగుచేస్తున్న రైతులు విజయవాడలోని అంభాపురం ఫ్యాక్టరీ పైనే ఆధారపడ్డారు. ఇక్కడ సాగు చేస్తున్న పంటను రైతులు ఏపీకి రవాణా చేసి అమ్ముకోవడం కష్టమైంది. అప్పటి ప్రభుత్వంతో జరిగిన ఒప్పందం ప్రకారం మూడేళ్ల క్రితమే నల్లగొండ జిల్లాలో ఫ్యాక్టరీ నిర్మించాల్సి ఉంది. కానీ భూముల రేట్లు ఎక్కువగా ఉన్నాయని పతంజలి సంస్థకు చెందిన జిల్లా ప్రతినిధులు జాప్యం చేశారు. గతేడాది నల్లగొండలో జరిగిన సమావేశంలో అప్పటి జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫ్యాక్టరీ నిర్మించకపోవడంపై పతంజలి అధికారులపై మండిపడ్డారు. రెండు నెలల్లో ఫ్యాక్టరీ నిర్మాణానికి చర్యలు చేపట్టకపోతే ప్రభుత్వం చేసుకున్న అగ్రిమెంట్ రద్దు చేస్తామని, యాదాద్రి జిల్లా తరహాలో ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్‌తో ఒప్పందం చేసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. దీంతో దిగొచ్చిన పతంజలి సంస్థ నాలుగైదు నెలల నుంచి స్థల సేకరణ కోసం అన్ని చోట్ల విచారణ చేపట్టింది. ఎట్టకేలకు స్థలాన్ని ఫైనల్ చేశారు.

పంట దిగుబడి ఐదు వేల టన్నులు..

టార్గెట్ ప్రకారం ప్రతి నియోజకవర్గంలో కనీసం 10 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలి. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని పది నియోజకవర్గాల్లో లక్ష ఎకరాల్లో పంట సాగు చేయాల్సి ఉంది. కానీ ఫ్యాక్టరీ లేకపోవడంతో రైతులు ఆసక్తి చూపలేదు. పైగా ఇక్కడ పండిన పంటను రైతులు సొంత ఖర్చులతో విజయవాడలోని అంభాపురం ఫ్యాక్టరీకి తీసుకెళ్లడం భారంగా మారింది. మొక్కలను మట్టితో నింపేందుకు అయ్యే ఖర్చులు కూడా రైతులే భరించాల్సి వచ్చేది. పంటల సాగును ప్రోత్సహించాల్సిన పతంజలి సంస్థ వివిధ రకాల ఖర్చులన్నీ రైతుల పైన మోపడంతో రైతులు ఆసక్తి చూపలేకపోయారు.

యాచారం గ్రామంలో ఫ్యాక్టరీ..

నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో కలిపి 15,800 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. నల్లగొండలోనే 70 శాతం పంట సాగవుతున్న నేపథ్యంలో ఫ్యాక్టరీ ఇక్కడే ఏర్పాటు చేయాలని సంస్థ నిర్ణయించింది. అనుముల మండలంలోని యాచారం గ్రామంలో అనువైన రేట్లకు భూమి లభించడంతో పంతంజలి సంస్థ ఫ్యాక్టరీ నిర్మాణానికి పూనుకుంది. 30 ఎకరాల్లో ఫ్యాక్టరీ నిర్మించనున్నారు. ప్రస్తుతానికి 20 ఎకరాలు రైతుల నుంచి కొనుగోలు చేశారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఎక్కువ మొత్తంలోనే భూముల సేకరించారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో భూమి పూజ చేసేందుకు సంస్థ ప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు.

ధర తగ్గినా రైతులకు లాభమే..

దేశ, విదేశాల్లో ఆయిల్‌పామ్‌కు మంచి డిమాండ్ ఉంది. ఎకరా వరిసాగుకు ఉపయోగించే నీళ్లతో నాలుగు ఎకరాలు ఆయిల్‌పాం సాగు చేయవచ్చు. పైగా డ్రిప్, మొక్కలకు రాయితీ లభిస్తుంది. పామాయిల్ ఎగుమతి, దిగుమతులను కేంద్ర ప్రభుత్వం బేరీజు వేస్తుంది. డిమాండ్‌ను బట్టి ప్రతి నెల రేట్లను నిర్ణయిస్తుంది. ఇటీవల ఆయిల్‌పాం ఎగుమతి, దిగుమతుల పైన సుంకాలను కేంద్రం తగ్గించింది. దీంతో టన్ను ధర రూ.13000 పడిపోయింది. ప్రస్తుతం టన్ను ధర రూ.18,778 కాగా గత నెలలో రూ.20 వేలు పలికింది. అయితే రూ.15 వేల వరకు అయిన రైతులకు నష్టం ఉండదని, ఫ్యాక్టరీ నిర్మాణం జరిగితే రైతులకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందని పతంజలి సంస్థ ప్రతినిధులు చెప్పారు. ఈ ఏడాది నల్లగొండ జిల్లాలో 6,500 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 3 వేల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రైతులకు ప్రయోజనం



జిల్లాలో పతాంజలి సంస్థ ఆయిల్‌పాం ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేస్తే.. రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుంది. రవాణా ఖర్చులు చాలా వరకు తగ్గుతాయి. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నందున రైతులు ఆయిల్‌పామ్ సాగుకు ముందుకురావాలి. రానున్న రోజుల్లో ఉమ్మడి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

– పి.అనంతరెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి

న్యూస్‌రీల్

నేడు జాతీయ లోక్ అదాలత్

రామగిరి(నల్లగొండ) : జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ ఎం.నాగరాజు తెలిపారు. జూన్ 9 నుంచి 14 వరకు చెక్ బౌన్స్ కేసులకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్, రాజీ పడదగిన క్రిమినల్, మోటార్ వాహన ప్రమాద, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్, భూ వివాదాలు, సైబర్ క్రైం కేసులు, ఇతర సివిల్ దావాలు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని కోరారు.

పేదలందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం



కల్వకుంట్లలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు : కాంగ్రెస్ ప్రభుత్వ రాష్ట్రంలోని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని కల్వకుంట్ల, కిష్టాపురం గ్రామాల్లో శుక్రవారం ఆయన పలు ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేనపటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్, ఎంపీఓ స్వరూపరాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, మాజీ సర్పంచ్‌లు పగిళ్ల భిక్షం, నందిపాటి రాధారమేష్, నాయకులు బొందు రవి తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

నాంపల్లి : ప్రభుత్వం అందిస్తున్న పథకలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. నాంపల్లిలోని స్త్రీశక్తి భవనంలో మహిళా సమాఖ్య, వీఓల శిక్షణ కార్యక్రమనికి ఆయన హాజరై మాట్లాడారు. రైతులకు పశువుల షెడ్లు, ఇండుకు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శర్మ, అరుణ్‌కుమార్, ఏపీఎం వినోద్‌కుమార్, ఏపీఓ వెంకటేష్, సీసీలు తదితరులు ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్

వేములపల్లి : ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు వేణుగోపాల్‌రెడ్డి, కేస రవి, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ అరుంధతి, టీడీ ఆఫీసర్ కల్యాణ్‌చక్రవర్తి, డాక్టర్ సుచరిత, సీనియర్ అసిస్టెంట్ సోమ్లానాయక్, సూపర్‌వైజర్ శాంతమ్మ, గీతావాణి, అరుణ, నరేష్ పాల్గొన్నారు.

15న ఉచిత వైద్యశిబిరం

నల్లగొండ టౌన్ : పట్టణంలోని నర్రా రాఘవరెడ్డి స్మారక ప్రజావైద్యశాల భవనంలో ఎంవీఎన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 15న ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టు కార్యనిర్వాహక కార్యదర్శి పి.నర్సిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ శిబిరానికి డాక్టర్ గోపాలం శ్రీమన్నారాయణ హాజరై రోగులకు ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు చేస్తారని, ఫిట్స్, పక్షవాతం రోగులకు కూడా పరీక్షలు చేస్తారని తెలిపారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఉద్యాన పంటలపై దృష్టి పెట్టాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



అంజీర తోటను పరిశీలిస్తున్న కలెక్టర్

తిప్పర్తి : రైతులు ఉద్యాన పంటలు సాగుచేసి అధిక లాభాలను పొందాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం తిప్పర్తి మండలం అంతయ్యగూడం గ్రామంలో రైతు సిరిగిరి కమలాకర్‌రెడ్డి సాగు చేస్తున్న అంజీర పంటను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల్లో సాగు చేశారు.. పంట ఎక్కడ అమ్ముతున్నారు.. మార్కెట్ ఎలా ఉంది.. నీటి సౌకర్యం ఉందా, ఫాం పాండ్ నిర్మించుకున్నారా.. బ్రాండింగ్.. మార్కెటింగ్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు అంజీర పంటను బ్రాండింగ్ చేసేందుకు పరిశీలించామన్నారు. స్థానిక స్వయం సహాయక మహిళా సంఘాల సహకారంతో వీలైతే ఒక రైతు ఉత్పత్తి కేంద్రాన్ని స్థాపించి దాని ద్వారా మార్కెటింగ్ చేయించాలని ఉద్యాన శాఖ అధికారి అనంతరెడ్డిని ఆదేశించారు. ఈ సందర్భంగా రైతు కమలాకర్‌రెడ్డి, సుగుణమ్మ దంపతులను సన్మానించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ..

తిప్పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి అనంతరెడ్డి, తహసీల్దార్ పరుశురాం, ఎంపీడీఓ వెంటేశ్వర్‌రెడ్డి, ఏఓ సన్నిరాజు, శ్రీనివాస్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

పనిచేసే వారికి పార్టీ పదవులు

- రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

నకిరేకల్ : కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసి చేసే వారందరికీ పార్టీ పదవుల్లో సుముచిత స్థానం దక్కుతుందని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి, మత్స్య, క్రీడల యువజన సర్వీస్‌ల శాఖ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి వాకిటి శ్రీహరి అన్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత శుక్రవారం సాయంత్రం తొలిసారి ఆయన నకిరేకల్ వచ్చారు. ఆయనకు స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. తాను కూడా కాంగ్రెస్ పార్టీలో కౌన్సిలర్ స్థాయి నుంచి నేడు మంత్రిగా ఎదిగానని.. అదే పార్టీ గొప్పతనం అన్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజ్ నేతృత్వంలో ప్రజలు, నాయకుల మధ్యే పార్టీ కమిటీల ఎన్నికలు జరగాలని స్పష్టం చేశారని పేర్కొన్నారు. తొలిసారిగా కార్యకర్తలు, నాయకుల సమక్షంలో జిల్లా, మండల, పట్టణ, గ్రామ అధ్యక్షులను, ఇతర కమిటీలను ఎన్నుకోనున్నామని చెప్పారు. ప్రతి పదవికి మూడు పేర్లు తీసుకుని ఎన్నిక చేసేందుకు పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుందన్నారు. పనిచేసే వారంతా పార్టీ పదవుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించడమే లక్ష్యంగా పార్టీ కమిటీల నియమకం చేస్తున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, పార్టీ జిమ్మే పరిశీలకుడు నాసర జయబాబా, మార్కెట్, మున్సిపల్ చైర్ పర్సన్లు గుత్తా మంజుల మాధవరెడ్డి, చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య, ఏసుపాదం, వెంకన్న, సుక్కయ్య, ఉశయ్య, శ్రీనివాస్, గంగధర్‌రావు, కొండయ్య, నర్సింహ, యాదగిరి, మల్లికార్జున్, పన్నాల రాఘవరెడ్డి, సత్తయ్య, సుందర్, నకిరెకంటి నరేందర్ పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులకు.. మూడు నెలల తర్వాతే బియ్యం

- మే 20వ తేదీ తర్వాత మంజూరైన కార్డులకు సెప్టెంబర్‌లో కోటా
- సుమారు 20 వేల మంది మూడు నెలలు ఆగాల్సిందే
- ప్రస్తుత కోటా 60 శాతం పంపిణీ పూర్తి



నల్లగొండ : కొత్తగా రేషన్ కార్డులు మంజూరవుతున్న వారికి మూడు నెలల తర్వాతే బియ్యం అందనున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం జూన్, జూలై, ఆగస్టు మాసాలకు సంబంధించిన బియ్యాన్ని జూన్‌లోనే ఒకే సారి ఇస్తుడడంతో.. మే 20వ తేదీ తర్వాత కార్డులు పొందిన వారికి సెప్టెంబర్‌లోనే సన్నబియ్యం అందనున్నాయి. గతంలో ఉన్న కార్డులతోపాటు అయితే మే 20వ తేదీ కంటే ముందు కార్డులు పొందిన వారికి కోటా ప్రకారం ప్రభుత్వం బియ్యం విడుదల చేసింది. కానీ ఆ తర్వాత కార్డులు పొందిన వారికి కోటా ఇవ్వకపోవడంతో.. వారంతా మూడు నెలలపాటు ఆగాల్సిందే.

జిల్లాలో 4,84,216 రేషన్‌కార్డులు

ఏళ్ల తరబడి రేషన్ కార్డుల కోసం ఎదురుచూసే వారికి ప్రభుత్వం కార్డులను మంజూరు చేస్తోంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి అన్ని స్థాయిలో పరిశీలన పూర్తయ్యాక కార్డులు జారీ చేస్తోంది. ఈ ప్రక్రియను ఏప్రిల్ నెల నుంచి ప్రారంభించింది. ఇలా మే 20వ తేదీ వరకు జిల్లాలో కొత్తవి, పాతవి కలిపి మొత్తం 4,84,216 రేషన్‌కార్డులు ఉన్నారు. అయితే వీటికి సంబంధించి 26 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం మూడు నెలల కోసం అలాట్ చేసింది. ఆయా కార్డుదారులకు ప్రస్తుతం బియ్యం పంపిణీ కొనసాగుతోంది.

60 శాతం కోటా పంపిణీ పూర్తి

మూడు మాసాలకు సంబంధించి బియ్యం పంపిణీని ఈ పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఇప్పటికే గోదాముల నుంచి రేషన్ షాపులకు 80 శాతం బియ్యం సరఫరా అయ్యాయి. అందులో 60 శాతం బియ్యం శుక్రవారం సాయంత్రానికి రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేశారు.

41,806 మంది కొత్తగా దరఖాస్తు..

జిల్లాలో ప్రస్తుతం 41,806 మంది కొత్త రేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అందులో 819 రిజక్ట్ అయ్యాయి. 31,530 కార్డులు అప్రూవల్ అయ్యాయి. ఇందులో పరిశీలన కోసం 9,422 కార్డులు ఉండగా.. తహసీల్దార్ లాగిన్‌లో 498, డీఎస్‌వో లాగిన్‌లో 195 ఉన్నాయి. ఇవి కూడా ఆయా స్థాయిల్లో అప్రూవల్ కానున్నాయి. అయితే మే 20వ తేదీ తర్వాత సుమారు 20 వేల కొత్త కార్డులు జారీ అయ్యాయి. వారందరికీ సెప్టెంబర్‌లోనే బియ్యం అందనున్నాయి. మూడు మాసాలకు సంబంధించిన బియ్యం ఇప్పటికే అలాట్ చేసినందున మే 20 తర్వాత వచ్చిన కార్డులకు సెప్టెంబర్ నుంచి సన్న బియ్యం ఇవ్వనున్నట్లు డీఎస్ఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎంజీ యూనివర్సిటీలో రక్తదాన శిబిరం

నల్లగొండ టూటౌన్ : ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణ పరిధిలోని ఎంజీ యూనివర్సిటీలో రక్తదాన శిబిరరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పాల్గొని రక్తదానం ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. రక్త దానం చేయండి.. మనిషి ప్రాణాలను నిలబెట్టండని సూచించారు. అనంతరం పలువురు ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ చైర్మన్ డాక్టర్ ప్రేమ్‌సాగర్, బి.వీరస్వామి, జి.సుధాకర్, అల్వాల రవి, మద్దిలేటి పసుపుల, రూప, తిరుమల, సత్తిరెడ్డి, ఆంజనేయులు, మాధురి తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

అక్కంపల్లి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రూ.20.07 కోట్లకు పెంపు

పెద్దఅడిశర్లపల్లి : ఏఎమ్మార్పీ ప్రాజెక్టులో భాగమైన అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పనులకు రూ.20.07 కోట్ల నిధులు పెంచుతూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2005లో అక్కంపల్లి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పనులకు రూ.11.05 కోట్ల నిధులు కేటాయించిన ప్రభుత్వం, 2013లో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ మిగిలిన పనులకు నిధులను రూ.18.135 కోట్లకు పెంచింది. అయినప్పటికీ అక్కంపల్లి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో అక్కంపల్లి కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు రూ.2.189 కోట్ల వ్యయం అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపగా అక్కంపల్లి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గాను రూ.2.189 కోటు కేటాయిస్తూ ఈ నెల 11న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిధుల కేటాయింపులో గతంలో పని చేసిన పనులకు బిల్లుల చెల్లింపుతో పాటు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి టెండర్లు పిలువడానికి ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది.

క్షయ స్క్రీనింగ్ పరీక్షలు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్


- స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్

నల్లగొండ : క్షయ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు పెంచాలని స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన క్షయ (టీబీ) ఫోరం సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025– 26 నాటికి క్షయ రహిత జిల్లాగా మార్చాలన్నారు. పరీక్షలను వేగవంతం చేసి క్షయ రోగులను గుర్తించి వారికి మెరుగైన చికిత్స అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా టీబీ పరీక్షలు చేయాలని సూచించారు. టీబీ సోకిన వారికి కేంద్ర ప్రభుత్వం నెలకు రూ.వెయ్యి ఇస్తుందని.. టీబీ రోగులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ జిల్లాలో 3 వేల క్షయ కేసులు ఉన్నాయన్నారు. టీబీ నివారణకు ప్రచార కార్యక్రమాలు చేపట్టి ఇంత వరకు 67 శిబిరాలను నిర్వహించి 13 వేల మందికి క్షయ పరీక్షలు చేసామని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, ఇన్‌చార్జి జెడ్పీ సీఈఓ శ్రీనివాసరావు, బ్లెస్సి ఎస్తర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు మందుల మాఫియా!

నల్లగొండ పట్టణానికి చెందిన యువకుడు ప్రణీత్‌కుమార్ (పేరు మార్చాం) ఇంజనీరింగ్ పూర్తి చేసి జులాయిగా తిరుగుతున్నాడు. ఈ యువకుడు గంజాయి, మత్తు పదార్థాలకు బానిసై చిన్నచిన్న గొడవలు చేస్తున్నాడు. అతడికి గంజాయి దొరకపోవడంతో.. మందుల దుకాణాల్లో దొరికే మత్తు ఇంజక్షన్లు కొనుగోలు చేస్తూ రోజూ వాడుతున్నాడు. ప్రకాశం బజార్‌లోని ఒక మందుల దుకాణంలో రోజూ మత్తు ఇంజక్షన్ కొనుగోలు చేస్తున్నట్లు 'సాక్షి' పరిశీలనతో వెల్లడైంది. ఇప్పుడు అతని ఆరోగ్యం క్షీణించి ఆస్పత్రి పాలయ్యాడు. చేతికొచ్చిన కొడుకు.. తమని ఆదుకుంటాడని భావించిన తల్లిదండ్రులకు దుఃఖాన్ని మిగిల్చాడు. మత్తు మందుల మాఫియా కారణంగానే తమ కుమారుడు అనారోగ్యం పాలయ్యాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదీ.. జిల్లాలో మత్తు మందుల విచ్చలవిడి విక్రయంతో జరుతున్న తీరు.

- డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మత్తు ఇంజక్షన్ల విక్రయం
- ఇష్టానుసారంగా వాడుతున్న యువత
- నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్న ఔషధ నియంత్రణ శాఖ అధికారులు



నల్లగొండ టౌన్ : జిల్లాలో మందుల మాఫియా రెచ్చిపోతుంది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మత్తు మందులను విక్రయిస్తున్నారు. కెపమైన్, ప్రొఫోల్, మెడెజోలమ్ డైజోఫామ్, లొరెజోఫామ్, ప్రమోడోల్‌తో పాటు కొన్ని దగ్గు మందులు కూడా మత్తులోకి దింపుతాయి. డ్రగ్స్, గంజాయికి అలవాటు పడిన యువకులు మత్తు ఎక్కడానికి ఈ మందులు కొనుగోలు చేసి వాడుతున్నారు. వీటితోపాటు ట్యాబ్లెట్‌లు కూడా పెద్ద ఎత్తున వాడుతున్నారు. వీటిన్నింటిని దుకాణదారులు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే విక్రయిస్తున్నట్లు సమాచారం. దీంతో యువత అనారోగ్యం పావడంతో పాటు వికృత చేష్టలు, నేరాలకు పాల్పడే అవకాశం ఉంటుందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఇంత దందా జరుగుతున్నా.. ఔషధ నియంత్రణ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నిరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పూర్తిస్థాయిలో లేని అధికారులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఔషధ నియంత్రణ శాఖ శాఖకు ఒక ఏడీ స్థాయి అధికారి, నల్లగొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, భువనగిరిలో ఒక్కో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు ఉండాలి. కానీ కొన్ని నెలల క్రితం నల్లగొండ ఇన్‌స్పెక్టర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. దీంతో అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. సూర్యాపేట ఇన్‌స్పెక్టర్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. మిర్యాలగూడలో ఇన్‌స్పెక్టర్ పోస్టు కొన్ని నెలలుగా ఖాళీగా ఉండగా.. సోమవారం అక్కడ ఓ అధికారి జాయిన్ అయ్యారు. నల్లగొండకు కూడా త్వరలో కొత్త ఇన్‌స్పెక్టర్ రానున్నట్లు తెలిసింది. అధికారులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి నెలనెలా లెక్కలను చూసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఇతరుల సర్టిఫికెట్లతో వ్యాపారం..

ఉమ్మడి జిల్లాలో సుమారు రెండు వందలకు పైగా ఔషధ నియంత్రణ శాఖ ద్వారా లైసెన్స్‌ను పొందిన దుకాణాలు ఉన్నాయి. ఇవి కాక.. అనుమతులు లేకుండా గ్రామీణ ప్రాంతాల్లో మరో 50 వరకు వరకు ఉంటాయి. మందుల దుకాణాలను నిర్వహించే వ్యాపారులు కచ్చితంగా డీ పార్మసీ లేదా ఎం.ఫార్మసీ సర్టిఫికెట్ పొందిన వారై ఉండాలి. కానీ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సగం దుకాణదారులు ఫార్మసీ సర్టిఫికెట్లు ఉన్న వ్యక్తులకు నెలకు కొంత మొత్త ఇస్తూ.. వారి సర్టిఫికెట్లతో లైసెన్స్‌ను పొంది వ్యాపారం చేస్తున్నారు. దీంతో వారికి డాక్టర్లు రాసిన ప్రిస్క్రిప్షన్ అర్థం కాక.. ఇష్టం వచ్చిన మందులను అమ్మి రోగుల జీవితాలతో చలగాటం ఆడుతున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఇకడబ్రాండెడ్ కంపెనీల మందుల పేరుతో జనరిక్ మందులను కొందరు మందులను అంటగట్టి వారి జేబులు నింపుకుంటున్నారని ఆరోపణలు సైతం ఉన్నాయి.

ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మొద్దు

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న మందుల దుకాణాల్లో నెల వారీగా తనిఖీలను నిర్వహిస్తున్నాం. ఫార్మసీ సర్టిఫికెట్ ఉంటేనే లైసెన్స్ ఇస్తాం. లైసెన్స్ లేకుండా మందులకు విక్రయించడానికి అవకాశం లేదు. మత్తెక్కించే డ్రగ్స్ ఇంజక్షన్లను డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే అమ్మాలి. ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్ కూడా రద్దు చేస్తాం.

– కె.దాస్, ఏడీ, ఔషధ నియంత్రణ శాఖ

క్లుప్తంగా

సైనిక్ గురుకుల కళాశాల విద్యార్థిని ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా ఎంపిక


కావ్య

బీబీనగర్: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సైనిక్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల 2021–2024 బ్యాచ్ విద్యార్థిని వి.కావ్య ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు.ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.జూన్ 28వ తేదీన దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ కార్యాలయానికి వెళ్లి విధుల్లో చేరనున్నారు. కళాశాల నుంచి ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు ఎంపికైన మొదటి విద్యార్థి కావ్య అని ప్రిన్సిపాల్ తెలిపారు. కావ్యను ప్రిన్సిపాల్ శ్రీలత, కళాశాల కార్యదర్శి వర్షిణి, సహాయ కార్యదర్శి పీఎస్ఆర్ శర్మ, ఉప కార్యదర్శి రజిని, అధ్యాపకులు అభినందించారు.

వాట్సాప్ గ్రూపులో తప్పుడు పోస్టు చేసిన వారిపై కేసు

మోత్కూరు : మండలంలోని ముశిపట్ల గ్రామ వాట్సాప్ గ్రూపులో కాంగ్రెస్ నాయకులపై తప్పుడు పోస్టు చేసి అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ డి.నాగరాజు తెలిపారు. వివరాలు.. ఈ నెల 6వ తేదీన మావూరి ముచ్చట్లు (ముశిపట్ల) గ్రూపులో కాంగ్రెస్ పార్టీ నాయకులపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ నేర్లకంటి శ్రీనివాస్, బోనగిరి హరీష్ పోస్టు చేశారు. ఆ గ్రామానికి చెందిన నిమ్మల రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భవన నిర్మాణ కూలీ మృతి

వలిగొండ : భవన నిర్మాణ పనికి వెళ్లిన వ్యక్తి పనిచేస్తున్న చోట ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. ఈ ఘటన వలిగొండ మండలంలోని వేములకొండలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నపాక బాబు అనే వ్యక్తి రామన్నపేట మండలంలోని ఎన్నారం గ్రామంలో నివాసం ఉంటూ భవన నిర్మాణ పనులకు దినసరి కూలీగా వెళ్తున్నాడు. చిన్నపాక బాబు గురువారం వలిగొండ మండలంలోని వేములకొండ గ్రామంలో భవన నిర్మాణ పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

బైక్ ఢీకొని సీనియర్ జర్నలిస్ట్ దుర్మరణం

చివ్వెంల(సూర్యాపేట) : బైక్ ఢీకొట్టడంతో జర్నలిస్ట్ మృతి చెందాడు. ఈ సంఘటన చివ్వెంల మండల కేంద్రంలో సూర్యాపేట–ఖమ్మం రహదారిపై శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ చెరుపల్లి సత్యం (70) మండల కేంద్రంలోని తన ఇంటి వద్ద రహదారి దాటుతుండగా మోతె నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న బైక్ అదుపు తప్పి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సత్యం, తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం సత్యంను సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్యం మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి.మహేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యాదగిరికొండ సర్కిళ్లకు దేవుళ్ల పేర్లు


శ్రీరామానుజ సర్కిల్


మల్లాపురం వెళ్లే దారిలో యాదర్శి సర్కిల్


ప్రెసిడెన్షియల్ సూట్, కల్యాణకట్టకు వెళ్లే దారిలో గరుడ సర్కిల్

- తిరుమల తరహాలో నామకరణం
- యాదగిరి కొండ చుట్టూ నాలుగు సర్కిల్స్
- దేవుళ్ల విగ్రహాల ఏర్పాటుకు సన్నాహాలు

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కొండ చుట్టూ ఉన్న రింగ్ రోడ్డు మరొక ఆధ్యాత్మిక కేంద్రంగా నిలువబోతుంది. ఇప్పటికే కొండ చుట్టూ రింగ్ రోడ్డు నిర్మించి, అందులో సర్కిల్స్, గ్రీనరీ ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులు స్వామివారిని దర్శించుకుని రింగ్ రోడ్డులో ఆయా సర్కిల్స్‌లో సేదతీరేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగానే తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లే క్రమంలో ఉన్న సర్కిల్స్‌కు ఏవిధంగా అయితే నామకరణాలు చేశారో.. ఇప్పుడు యాదగిరి కొండ కింద ఉన్న సర్కిల్స్‌కు సైతం దేవుళ్ల పేర్లను అధికారులు పెట్టారు.

మూడు, నాలుగు నెలల్లో విగ్రహాల ఏర్పాటు..

తిరుమల తిరుపతి తరహాలోనే యాదగిరి కొండకు దిగువన ఉన్న సర్కిల్స్‌కు నామకరణం చేశారు. ఇందులో వైకుంఠద్వారం వద్ద ఉన్న సర్కిల్‌కు శ్రీ అభయాంజనేయ, ప్రెసిడెన్షియల్ సూట్ వెళ్లే దారిలో ఉన్న సర్కిల్‌కు గరుడ, కొండపైకి వెళ్లే ఎగ్జిట్ ఫ్లైఓవర్ (ప్రస్తుతం మూడో ఘాట్‌రోడ్డు ప్రారంభంలో) వద్ద ఉన్న సర్కిల్‌కు రామానుజ, యాదగిరిగుట్ట నుంచి మల్లాపురం వెళ్లే దారిలో ఉన్న సర్కిల్‌కు యాదర్శిగా నామకరణం చేశారు. ఈ నామకరణం చేసిన సర్కిళ్లలో ఆయా దేవుళ్ల విగ్రహాలను సైతం ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఈఓ వెంకట్రావ్ ఆలయ అర్చకులు, స్థపతులతో వాస్తు, ఆగమశాస్త్ర అంశాలపై చర్చించారు. మూడు, నాలుగు నెలల్లో విగ్రహాల ఏర్పాటు పూర్తి చేస్తామని ఈఓ చెబుతున్నారు.

రింగ్ రోడ్డులో భాగంగా..


శ్రీ అభయాంజనేయ సర్కిల్‌గా నామకరణం చేసిన వైకుంఠద్వారం సర్కిల్

యాదగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధి, పునః నిర్మాణంలో భాగంగా కొండ చుట్టూ సుమారు 5.2 కిలోమీటర్ల రింగ్ రోడ్డును విస్తరించారు. ఇందుకుగాను గత ప్రభుత్వం రూ.235.7 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందులో భూసేకరణతోపాటు రింగ్ రోడ్డు విస్తరణ, ఎంట్రీ, ఎగ్జిట్ ఫ్లైఓవర్స్, గ్రీనరీ, డ్రైనేజీతోపాటు నాలుగు దిక్కులు నాలుగు సర్కిళ్ల ఏర్పాటుకు ఈ నిధులు ఖర్చు చేశారు. వైకుంఠద్వారం, మల్లాపురం వెళ్లే రహదారి, కొండపైకి ఎక్కడానికి ఏర్పాటు చేసిన మూడో ఘాట్ రోడ్డు, ప్రెసిడెన్షియల్ సూట్‌కు వెళ్లే మార్గంలో ఈ సర్కిళ్లను ఏర్పాటు చేసి, అందులో రకరకాల పుష్పాలతో భక్తులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దారు. ఈ సర్కిళ్లకే దేవుళ్ల పేర్లు పెట్టారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా..

స్వామివారి క్షేత్రానికి వచ్చిన భక్తులు ఆయా సర్కిల్స్ వద్ద ఆగిపోతున్నారు. వైకుంఠద్వారం నుంచి రింగ్ రోడ్డు చుట్టూ తిరుగుతూ ఆలయానికి, కల్యాణకట్ట, పుష్కరిణి, అన్నదాన సత్రం, తులసీ కాటేజీ వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే దారి తెలియక, రింగ్ రోడ్డులో ఏ సర్కిల్ వద్ద ఉన్నామో తెలియక తికమక పడుతున్నారు. దీంతో ఆలయ ఈఓ వెంకట్రావ్ రింగ్ రోడ్డులో ఉన్న సర్కిల్స్ కు వివిధ దేవుళ్ల పేర్లు పెడితే భక్తులు ఎక్కడ ఉన్నారో తమ కుటుంబ సభ్యులకు తెలిపేందుకు సులువుగా ఉంటుందని సర్కిల్స్‌కు నామకరణం చేశారు. వైకుంఠద్వారం వద్దకు వచ్చిన వారికి ఏ సర్కిల్ వద్దకు వెళ్తే ఏ ప్రాంతానికి వెళ్తాం అనే వివరాలు సులువుగా తెలిసే అవకాశం ఉంది.

కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన ఉపాధ్యాయుడు

మోత్కూరు : మోత్కూరు పట్టణానికి చెందిన దాసరి వెంకన్న జనగామ జిల్లా దేవరుప్పుల మండలం దరావత్ తండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. పాఠశాలలు పునః ప్రారంభమైన సందర్భంగా తన కుమారుడు రాహుల్‌ను శుక్రవారం మోత్కూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 6వ తరగతిలో చేర్పించాడు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని, విద్యార్థి సంపూర్ణ మనో వికాసానికి దోహదపడే బోధన ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉంటుందని వెంకన్న చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి విద్యార్థి రాహుల్‌కు అడ్మిషన్ అందజేశారు. కాగా, రాహుల్ 5వ తరగతి వరకు ప్రైవేట్ పాఠశాలలో చదివాడు.


పాఠశాల వద్ద కుమారుడితో ఉపాధ్యాయుడు దాసరి వెంకన్న

ట్రాన్స్‌కో, డిస్కమ్ ఇంటర్ సర్కిల్ కబడ్డీ విజేత నల్లగొండ

హన్మకొండ: తెలంగాణ ట్రాన్స్‌కో, డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ 2025–2026 శుక్రవారం ముగిసింది. కబడ్డీ ఫైనల్‌లో నల్లగొండ, వరంగల్ జట్లు పోటీపడగా నల్లగొండ జట్టు విజేతగా నిలిచింది. వరంగల్ జట్టు ద్వితీయ స్థానం, నిజామాబాద్ తృతీయ స్థానంలో నిలిచాయి. కబడ్డీ పోటీల్లో 12 జట్లు, బాల్ బ్యాడ్మింటన్‌లో 9 జట్లు పాల్గొన్నాయి. బాల్ బ్యాడ్మింటన్ ఫైనల్‌లో వరంగల్, మహబూబ్‌నగర్ జట్లు పోటీ పడగా వరంగల్ సర్కిల్ విద్యుత్ ఉద్యోగుల జట్టు విజేతగా నిలిచింది. మహబూబ్‌నగర్ జట్టు ద్వితీయ స్థానంలో, నల్లగొండ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి.


కబడ్డీలో మొదటి బహుమతి అందుకుంటున్న నల్లగొండ జట్టు

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

నల్లగొండ, తిప్పర్తి : జిల్లా కేంద్రం సమీపంలో రైలు కింద పడి ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. నల్లగొండ పోలీసులు, రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. నిడమనూరు మండలం ముప్పారం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ గోశెట్టి నిషాంత్‌వారం క్రితం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. దీంతో గురువారం సాయంత్రం నిషాంత్ తల్లిదండ్రులు నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా శేషరాజుపల్లి సమీపంలోని రైల్వే ట్రాక్ దగ్గర రైలు కింద పడి నిషాంత్ ఆత్మహత్య చేసుకున్నాడు. నిషాంత్ రెండేళ్ల క్రితం మేన మరదలిని రెండో వివాహం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారికి ఏడాది వయసు ఉన్న బాబు ఉన్నాడు.

హిజ్రాను మొదట పెళ్లి చేసుకున్న నిషాంత్..

నిషాంత్ కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌లోని అమీర్‌పేటలో ఓ హిజ్రాతో పరిచయం ఏర్పడి పెళ్లి చేసుకుని స్వగ్రామానికి తీసుకురాగా తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. ఈ క్రమంలోనే నిషాంత్, హిజ్రాకు మధ్య ఘర్షణ ఏర్పడింది. దీంతో అప్పట్లో హిజ్రా అమీర్‌పేటకు వెళ్లి ఆత్మహత్య చేసుకుంది. హిజ్రాలంతా కలిసి హిజ్రా మృతదేహాన్ని తీసుకొచ్చి నిడమనూరు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. అయితే ఈ మధ్యనే కేసు కొట్టేశారని నిషాంత్ బంధువులు తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. నిషాంత్ చావుకు కుటుంబ కలహాలే కారణమా.. గతంలో ఆత్మహత్య చేసుకున్న హిజ్రా కుటుంబంతో ఏవైనా గొడవలు ఉన్నాయా అని పోలీసులు విచారిస్తున్నారు.

రైళ్లలో చోరీకి పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు

- ఫోన్, బంగారం, నగదు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

నల్లగొండ: నల్లగొండ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ బి.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితుడి వివరాలను ఆయన వెల్లడించారు. ఏపీలోని పల్నాడు జిల్లా గురజాల మండలం పులిపాడ్ గ్రామానికి చెందిన జమ్మిగుంపుల శ్రీకాంత్ అనే యువకుడు నల్లగొండ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. విచారించిన అనంతరం నిందితుడి వద్ద నుంచి 20 గ్రాముల బంగారం, ఒక మొబైల్ ఫోన్, రూ.4930 స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ రమణ, రైల్వే పోలీసులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నకిరేకల్: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలం నోముల శివారులోని ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన షేక్ సయ్యద్(52) ఆర్థిక ఇబ్బందులతో ఈ నెల 11వ తేదీన తన వ్యవసాయ భూమిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న సయ్యద్‌ను కుటుంబీకులు చికిత్స కోసం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సయ్యద్ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కృష్ణమాచారి తెలిపారు.

కాపర్ వైర్ చోరీ

పాలకవీడు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ కోర్‌ను దుండగులు అపహరించుకుపోయారు. ఈ ఘటన పాలకవీడు గ్రామ సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ అవసరాల కోసం పాలకవీడు గ్రామ సమీపంలో మూడు 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను అధికారులు ఏర్పాటు చేశారు. కాగా శుక్రవారం ఉదయం రైతులు పొలాల వద్దకు వచ్చి చూసేసరికి ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమై ఉన్నాయి. రైతులు వెంటనే విద్యుత్ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. విద్యుత్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. గత సంవత్సరం ఇదే సమయంలో ఇవే ట్రాన్స్‌ఫర్మర్లను ధ్వంసం చేసి అందులోని విలువైన కాపర్ సామగ్రిని దుండగులు అపహరించుకుపోయినట్లు తెలిపారు. సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు కావడంతో దొంగలు చోరీలకు పాల్పడుతున్నారని, వీటి స్థానంలో 75 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

రెండు ఇళ్లల్లో చోరీ

బీబీనగర్: మండల కేంద్రంలోని ఓ కాలనీలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. బీబీనగర్‌లోని గోకుల్‌నగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న ఏపీలోని తూర్పు గోదావరికి చెందిన వెంకటేశ్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు రోజుల క్రితం ఊరికి వెళ్లాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి ఇంట్లో ఉన్న తులం బంగారు చైన్‌తోపాటు వెండి వస్తువులను అపహరించుకుపోయారు. వారు శుక్రవారం ఇంటికి వచ్చి చూసేసరికి దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. చోరీ జరిగిన ఇంట్లో పోలీసులు శుక్రవారం పరిశీలించి ఆధారాలు సేకరించారు. అలాగే అదే కాలనీలో చోరీ జరిగిన ఇంటి సమీపంలో పోచంపల్లి మండలంలోని ఇంద్రియాలకు చెందిన కవిత అద్దెకు ఉంటోంది. ఆమె కూడా ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి వస్తువులను చిందరవందరగా పడవేశారు. ఏమీ లభించకపోవడంతో వెనుదిరిగారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఇంటిని పరిశీలించారు. కాగా ఇదే కాలనీలో ఇటీవల ఓ ఇంట్లో రూ.50 వేల నగదుతోపాటు బయట పార్క్ చేసి ఉన్న కారును దొంగిలించుకుపోయారు.

ఆలయంలో..

నడిగూడెం : మండల పరిధిలోని వేణుగోపాలపురం సమీపాన ఉన్న శ్రీలక్ష్మి తిరుపతమ్మ ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ దారపునేని నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ తాళాలు పగులగొట్టి, ఆలయంలోని హుండీలను ధ్వంసం చేసి హుండీల్లో ఉన్న దాదాపు రూ.15 వేల నగదు చోరీ చేశారు. ఈ విషయమై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్


ప్రయాణికురాలికి హ్యాండ్‌బ్యాగ్ అందజేస్తున్న కండక్టర్ జంగయ్య

చిట్యాల: బస్సులో ప్రయాణికురాలు మరచిపోయిన హ్యాండ్‌బ్యాగ్‌ను భద్రపరిచి తిరిగి ఆమెకు అందజేసి తన నిజాయితీ చాటుకున్నాడు ఆర్టీసీ కండక్టర్ జంగయ్య. వివరాలు.. నల్లగొండ నుంచి భువనగిరి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఎల్లారెడ్డిగూడెం నుంచి చిట్యాలకు వస్తున్న యువతి తన హ్యాడ్‌బ్యాగ్‌ను మరిచిపోయి చిట్యాల బస్టాండ్‌లో దిగి వెళ్లిపోయింది. అనంతరం ఆ యువతి కార్గో సెంటర్ నిర్వాహకుడు పొలిమెర దశరథ ద్వారా కండక్టర్‌కు సమాచారం అందించింది. దీంతో హ్యాండ్ బ్యాగును కండక్టర్ తీసుకుని తన వద్ద భద్రపరుచుకున్నాడు. వెంటనే రామన్నపేటకు వచ్చిన యువతికి కండక్టర్ జంగయ్య ఆహ్యాండ్‌బ్యాగు అందజేసి నిజాయితీ చాటుకున్నాడు.

విద్యార్థినిపై కోతుల దాడి

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన మూడో తరగతి చదువుతున్న విద్యార్థిని గుండోజు విజయలక్ష్మి శుక్రవారం తన స్నేహితులతో కలిసి పాఠశాలకు వెళ్తుండగా మార్గమధ్యలో విజయలక్ష్మిపై కోతులు దాడి చేశాయి. దీంతో ఆ చిన్నారి స్వల్ప గాయాలపాలైంది. ప్రథమ చికిత్స అనంతరం త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చిన్నారిని వైద్యం కోసం తరలించారు.

తాటిచెట్టు ఎక్కడం ఇక సులువే..


తాటిచెట్టు ఎక్కుతున్న రాగటి ఆనంద్


తాటిచెట్టు ఎక్కేందుకు కోకోనట్ క్లైంబర్‌ను తీసుకెళ్తున్న గీత కార్మికుడు రాగటి ఆనంద్

ఆత్మకూరు(ఎం): యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం కామునిగూడెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు రాగటి ఆనంద్ ×కోకోనట్ క్లైంబర్× (కొబ్బరిచెట్లు ఎక్కే పరికరం) సహాయంతో తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తున్నాడు. తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో దీనిని తయారు చేయించి తీసుకొచ్చాడు. యూట్యూబ్‌లో చూసి తెచ్చుకున్నానని, ఈ పరికరం ఐదు కిలోల బరువు ఉంటుందని, దీని ధర రూ.10,600 ఉందని ఆనంద్ చెప్పాడు. ఒక చెట్టు నుంచి మరో చెట్టు వరకు మోకును తీసుకెళ్లినట్టే సులభంగా తీసుకెళ్లవచ్చని, గీత కార్మికులకు రక్షణగా ఉంటుందని వివరించాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

వలిగొండ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన వలిగొండ మండలంలోని అక్కంపెల్లి వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. 108 సిబ్బంది, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన అనిల్ (35) అనే వ్యక్తి ఔటర్ రింగ్ రోడ్డులో టోల్గేటు వద్ద విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా పని ముగించుకుని రామన్నపేట మండలంలోని పల్లివాడలో బంధువుల ఇంటికి తన మోటారు సైకిల్‌పై వెళ్తుండగా రోడ్డుపై ఉన్న గుంతలో పడి మోటారు సైకిల్ అదుపుతప్పి అనిల్ కిందపడిపోయారు. అంతలో వెనుక నుంచి వస్తున్న లారీ అనిల్ కాలి పైనుంచి వెళ్లడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అనిల్‌ను వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

నకిరేకల్ : తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో అకస్మాత్తుగా చెట్టు కూలిపోవడంతో ఓ గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. వివరాలు.. చందుపట్లకు చెందిన కొప్పు పెద్ద శ్రీను(44) గీత కార్మికుడు రోజువారీ మాదిరిగా తాటి చెట్టు ఎక్కేందుకు వెళ్లాడు. చెట్టు ఎక్కుతున్న క్రమంలో గాలి రావడంతో అది కూలిపోయి కిందపడి గాయపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనును కుటుంబ సభ్యులు నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రెండు ట్రాక్టర్లు ఢీకొని డ్రైవర్‌కు..


గాయపడిన చంటి

వేములపల్లి: రెండు ట్రాక్టర్లు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం వేములపల్లి మండలంలోని మొల్కపట్నం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రావులపెంట గ్రామం నుంచి మిర్యాలగూడ వైపు ఇసుక లోడ్‌తో అతివేగంగా వెళ్తున్న ట్రాక్టర్.. కారును తప్పించబోయి మిర్యాలగూడ నుంచి రావులపెంట వైపు ఇసుకను అన్‌లోడ్ చేసి వెళ్తున్న మరో ట్రాక్టర్‌ను మొల్కపట్నం గ్రామ శివారు వద్ద ఢీకొట్టింది. దీంతో ఇసుక లోడ్‌తో ఉన్న ట్రాక్టర్ పల్టీ కొట్టడంతో ట్రాక్టర్ డ్రైవర్ చంటికి తీవ్ర గాయాలయ్యాయి. మరొక ట్రాక్టర్ డ్రైవర్ తృటిలో తప్పించుకున్నాడు. రెండు ట్రాక్టర్లు రావులపెంట గ్రామానికి చెందినవే. స్థానికులు 108 వాహనం సహాయంతో తీవ్ర గాయాలపాలైన చంటిని మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గంటకు పైగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

దోపిడీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

- పరారీలో మరో నిందితుడు

చౌటుప్పల్ : ప్రయాణికురాలిని తమ వాహనంలో ఎక్కించుకున్న ముగ్గురు వ్యక్తులు మార్గమధ్యలో దారి దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఈ నెల 9న చోటుచేసుకోగా అందుకు సంబంధించిన ఇద్దరు నిందితులు శుక్రవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో పోలీసులకు చిక్కారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. కేసుకు సంబంధించిన వివరాలను సీఐ మన్మథకుమార్ శుక్రవారం వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని బాటసింగారం శివారులో సింగరేణి కాలనీకి చెందిన చింతల ఉపేంద్రమ్మ (61) ఈ నెల 9న సూర్యాపేటలో ఉన్న తన బంధువుల ఇంటికి వెళ్లేందుకు జాతీయ రహదారిపై బస్సు కోసం నిలబడింది. కొంతసేపటి తర్వాత హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న ఓ నంబర్‌ప్లేటు లేని ఆటోను ఆపింది. తనను చౌటుప్పల్ బస్‌స్టేషన్ వద్ద దింపాలని అడిగింది. బస్‌చార్జీతో సమానంగా చెల్లిస్తే దింపుతామని చెప్పగా ఆమె అంగీకరించింది. దాంతో వారు ఆమెను ఆటో ఎక్కించుకున్నారు.

మార్గమధ్యలో దోపిడీకి పాల్పడిన నిందితులు

ఉపేంద్రమ్మ ఆటోలో ఎక్కిన సమయంలో అప్పటికే ఆటోలో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. అదును కోసం ఎదురుచూసిన నిందితులు బాటసింగారం నుంచి ఎల్లగిరి క్రాస్ రోడ్డు వద్దకు రాగానే ఆటోను సర్వీస్ రోడ్డు నుంచి 100 మీటర్ల దూరం తీసుకెళ్లారు. అనుమానించిన ఉపేంద్రమ్మ వారిని ప్రశ్నించింది. ఏదో జరుగుతుందని భావించిన ఆమె బిగ్గరగా అరవడం ప్రారంభించింది. దాంతో ఆటోలోని ఓ వ్యక్తి ఆమె నోటిని మూయగా మిగిలిన ఇద్దరు ఆమె మెడలో ఉన్న రెండున్నర తులాల విలువైన బంగారు గొలుసు లాక్కున్నారు. అనంతరం ఆమెను ఆటో నుంచి బయటకు నెట్టేసి అక్కడి నుంచి ఆటోతో పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం చౌటుప్పల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఇద్దరు నిందితులు పట్టుబడ్డారు. వారిని రంగారెడ్డి జిల్లా బైరమల్‌గూడలో నివాసం ఉండే నల్లగొండ జిల్లా చందంపేట మండలం తెల్దేవులపలి గ్రామానికి చెందిన రమావత్ రాము(21), రంగారెడ్డి జిల్లా మీర్‌పేట గాయత్రినగర్‌లో నివాసం ఉండే చందంపేట మండలం జగ్నాతండాకు చెందిన నేనావత్ గోపాల్(30)గా గుర్తించారు. మరో నిందితుడైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా ఊట్కూర్ గ్రామానికి చెందిన గజ్జల సమరసింహారెడ్డి(24) పరారీలో ఉన్నాడు. ఈ మేరకు నిందితులను కోర్టులో హాజరుపరిచారు. అనంతరం నల్లగొండ జైలుకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.